క్లుప్తంగా

జీఓను వెనక్కి తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 01 వెంటనే వెనక్కి తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యంగా పోరాటాలు చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. దానిని అణచివేయాలని చూడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, ప్రసాద్ గౌడ్, మామిళ్ల బాబు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

8న డీవైఎఫ్ఐ జిల్లాస్థాయి వర్క్ షాప్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని బద్వేల్‌లో ఈ నెల 8న డీవైఎఫ్ఐ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి వర్క్ షాప్‌లో నిరుద్యోగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు విజయ్, పవన్ కుమార్, మహేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ సహకారంతో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రామకృష్ణ హైస్కూలులో నిరుద్యోగ యువతీ యువకులకు ట్యాలీ, కంప్యూటర్ బేసిస్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 18–25 ఏళ్లలోపు ఉండి, టెన్త్, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 8008032358, 9052418238 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సైన్సు పితామహుడు న్యూటన్

కడప ఎడ్యుకేషన్: సైన్సు పితామహుడు న్యూటన్‌ను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా కన్వీనర్, వక్కలపేట మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెడ్‌టీచర్ నజీబుల్లా పేర్కొన్నారు. కడప వక్కలపేట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సైంటిస్టు సర్ ఐజాక్ న్యూటన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు పితామహుడు న్యూటన్ భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్తతోపాటు సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా అని అన్నారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మెన్ సలీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చలి దుస్తుల పంపిణీ

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 17వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులకు చలి దుస్తులను కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస రెడ్డి బుధవారం సచివాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

27న శ్రీకృష్ణదేవరాయుల జయంతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 27వ తేదిన శ్రీకృష్ణ దేవరాయుల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా బలిజ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజున కడప నగరంలోని కృష్ణా సర్కిల్‌లో గల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి ఉదయం 9.30 గంటలకు పూలమాలలు సమర్పించడంతోపాటు ఘనంగా నివాళులర్పిస్తారన్నారు. అనంతరం 10.30 నుంచి 2.00 గంటలకు వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఉంటుందని.. బలిజ కులస్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రామాంజనేయపురంలో నీటి ఎద్దడి

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని జర్నలిస్టుకాలనీ, వరదకాలనీ, ఆచారి కాలనీ ప్రాంతాల్లో నాలుగు రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది.జర్నలిస్టు కాలనీలోని మోటారు పాడవడంతో ఇక్కడ తాగునీటి సమస్యలు ఏర్పడ్డాయి. ఈ కాలనీల్లో ఎక్కువగా నివసిస్తున్నది కూలీ నాలీ చేసుకునే వారే. ఉదయం పనులకు పోతే రాత్రికి వస్తారు. పనులకు పోయి అలసి వచ్చిన వారికి ఇంట్లో నిత్యావసరాలు తీర్చుకోవడానికి, స్నానం చేయడానికి నీళ్లు లేక నాలుగు రోజులుగా అల్లాడుతున్నారు అధికారులు ఇప్పటికైనా స్పందించి మోటారును వెంటనే మరమ్మతు చేయించి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భర్త, బంధువులపై వరకట్న వేధింపుల కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని ఖలీల్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆరీఫున్(23) అనే మహిళ తన భర్త మహమ్మద్‌గౌస్, అతని తల్లిదండ్రులు, బంధువులపై ఫిర్యాదు చేసింది. తనకు, మహమ్మద్ గౌస్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. తన భర్త కువైట్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవ రాయుడు తెలిపారు.

అంధుల ఆరాధ్యదైవం లూయీ బ్రెయిలీ

కడప కల్చరల్/కడప ఎడ్యుకేషన్: ప్రపంచంలోని అంధులకు లూయీ బ్రెయిల్ ఆరాధ్య దైవంగా నిలిచారని మాజీ కార్పొరేటర్ జాకీరుద్దీన్ తెలిపారు. లూయీ బ్రెయిల్ జయంతి సందర్భంగా అంగడి వీధిలోని ఏపీ వలంటరీ ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్స్ రిలీఫ్ నిర్వహిస్తున్న ఆర్ఫన్ ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ సర్వీసు సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి షేక్ కమాల్‌బాష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు సంస్థ అభివృద్ధి కోసం రూ. 12 వేలు సాయం అందించారు. గోపాల్, కిశోర్, ఖాజావలీ, వెంకటరెడ్డి, గుర్రయ్య, నాగభూషణరెడ్డి, రసూల్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో రక్తదానం చేస్తున్న సిబ్బంది


సంస్థకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ జాకీరుద్దీన్ తదితరులు

అంధుల పాఠశాలలో..

అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ అని అంధుల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య అన్నారు. బుధవారం కడప నగరంలోని అంధుల పాఠశాలలో బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని పాఠశాలల ఆవరణలో ఉన్న లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాయల్ కరీం సేవాసమితి అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: స్వచ్ఛ భారత్ మిషన్‌లో పని చేస్తున్న క్లాప్ మిత్రులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్వచ్ఛ భారత్ మిషన్‌లోని క్లాప్ మిత్రలకు పది నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్‌లోని క్లాప్ మిత్రులకు పది నెలల వేతనాలను తక్షణం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 680 ప్రకారం వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కెసీ బాదుల్లా,నాయకులు వెంకట సుబ్బయ్య, ఆనంద రావు, ఇమ్మానియేల్, హనుమంతు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపడుతున్న స్వచ్ఛ భారత్ మిషన్‌లోని క్లాప్ మిత్రులు

రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తాం

మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బంగారు నాగయ్య, పల్లెకొండు సంపత్

కడప అగ్రికల్చర్: రైతులు తాము పండించిన పంటలను దళారులతో సంబంధం లేకుండా నేరుగా మార్కెట్ యార్డులో అమ్ముకునేందుకుగా వీలుగా కడప మార్కెట్‌యార్డులో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బంగారు నాగయ్య, పల్లెకొండు సంపత్ తెలిపారు. కడప మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి ఆదేశాల మేరకు బుధవారం కడప మార్కెట్ యార్డు సెక్రటరీ బాల వెంకటరెడ్డితో కలిసి మార్కెట్‌యార్డులో అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా గోడౌన్‌లు ఉన్నాయన్నారు. అలాగే యార్డుకు వచ్చే రైతులు విశ్రాంతి తీసుకునేందుకు విశ్రాంతి భవనం కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కెట్‌యార్డులో ఇంకా మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్‌బాబుల సహకారంతో ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో ప్రభుత్వ సహకారంతో కోల్డ్ స్టోరేజ్ ఇంకా అధునాతన సౌకర్యాలు కల్పిస్తామని రైతులు మార్కెట్‌యార్డును ఉపయోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బాల అంకిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


మార్కెట్‌యార్డులో సౌకర్యాలను పరిశీలిస్తున్న డైరెక్టర్లు బంగారు నాగయ్య, సంపత్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసకు మద్దతు

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏపీ వర్క్ అండ్ పెట్ ఇన్‌స్ట్రక్టర్స్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. శివకుమారి రెడ్డి, కార్యదర్శులు పద్మ, అనురాధ, గౌరమ్మ, వెంకటసుబ్బయ్య తదితరులు వెన్నపూస అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వి. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులంతా తమ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి వేయించి గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు కిరణ్, ఎస్. వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, మల్లేశ్వర, ప్రతాప్‌రెడ్డి, హరివర్ధన్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.


వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు తెలుపుతున్న ఏపీ వర్క్ అండ్ పెట్ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్, సెక్రటరీ జనరల్‌గా మహమ్మద్ ఇర్షాద్

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం కడప పట్టణంలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఇందులో ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా మాదన విజయ్‌కుమార్ (యూటీఎఫ్), సెక్రటరీ జనరల్‌గా షేక్ మహమ్మద్ ఇర్షాద్ (రూట), కో చైర్మెన్‌గా రామచంద్రబాబు(బీటీఏ), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా భాస్కర్ రెడ్డి(ఏపీటీఎఫ్-257), అబ్దుల్లా (ఏపీటీఎఫ్-1938), వంశీకృష్ణ(హెచ్ఎంఏ), ట్రెజరర్‌గా చెన్నకేశవరెడ్డి(ఎస్టీయూ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 14 ఉపాధ్యాయ సంఘాలతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఏర్పాటై కొనసాగుతోంది.


మాదన విజయ్‌కుమార్


మహమ్మద్ ఇర్షాద్

ఆదాయ పన్ను పరిమితి పెంచాలి

ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఆదాయపపు పన్ను పరిమితిని రెండున్నర లక్ష నుంచి ఐదు లక్షలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాజంనేయ ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయ పన్ను పరిమితిని 2014 నుంచి ఇంతవరకు మార్చ చేయలేదన్నారు. వేతన జీవులు పన్ను చెల్లింపు కింద ఒక నెల జీతాన్ని చెల్లిస్తున్నారని తద్వారా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. పన్ను చెల్లించిన తరువాత జూనియర్ల జీతం కంటే సీనియర్ల జీతం తక్కువగా ఉంటోందన్నారు. సెక్షన్ 80 సి కింద పొదుపు మొత్తాలను లక్షా 50 వేల రూపాయల నుంచి 3 లక్షలకు పెంచాలన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు,జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయ ప్రసాద్

నూతన పింఛన్ల పంపిణీ

చింతకొమ్మదిన్నె : మండల పరిధి 12 పంచాయతీలలోని 104 మందికి నూతన వైఎస్ఆర్ పింఛన్ కానుకను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి అందజేసి మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి నూతన పెన్షన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, వైస్ ఎంపీపీ గజ్జల సుధాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి, ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేస్తున్న జడ్పీటీసీ పి. నరేన్ రామాంజులురెడ్డి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు అన్నారు. మండలంలోని ఇప్పెంట పంచాయతీ పరిధిలోని బోడెద్దులపల్లి గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని పథకాలగురించి ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను అందించేందుకు వలంటీర్ వ్యవస్థ క్షేత్ర స్థాయిలో పనిచేస్తోందన్నారు. వలంటీర్ వ్యవస్థను ప్రతి రాష్ట్రంలోని ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధం అవుతోందన్నారు. రాష్ట్రంలో కొందరు ప్రతిపక్ష నాయకులు జగన్‌పై విషం చిమ్మేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, యూత్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై వచ్చిన వినతిపత్రాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులురెడ్డిలు తెలిపారు. కడప నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను ఎంత మేర పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు.

8న బ్రాహ్మణ సంఘం వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని పాత రాఘవేంద్ర స్వామి గుడిలో ఈనెల 8న ఉదయం 11 గంటలకు బ్రాహ్మణ సేవా సంఘం వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, రంజన్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలో భగవత్‌గీత పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం, బ్రహ్మశ్రీ తిప్పాబొట్ల వెంకట సుబ్బ అవధానుల సంస్మరణ సభ, మంత్రాలయంలోని వేదపాఠశాల అధ్యాపకుడు లక్ష్మీ నారాయణ శర్మకు సన్మానం తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బ్రాహ్మణులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని ఇన్‌స్పైరి టీచర్ అండ్ బెస్ట్ ట్రైనర్ ప్రొఫెసర్ ఎంఎల్ సాయికుమార్ తెలిపారు. స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కాలేజిలో బుధవారం డిప్లమో, బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇన్‌వైట్ టాక్ ఆన్ గోల్ సెట్టింగ్ అనే అంశంపై మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దీర్ఘకాలిక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెట్ వీరకల్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయికుమార్

అరటిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కాశినాయన : రైతులు అరటి పంటలో యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి మైఖేల్‌రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోడిగుడ్లపాడు, కొండ్రాజుపల్లె గ్రామాల్లోని ఉద్యాన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటిలో ఎక్కువగా సిగటోగ ఆకుమచ్చతెగులు వస్తుందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సమావేశంలో ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి, హార్టికల్చర్ సహాయకుడు మహేష్, ఎఫ్‌పీఐ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, అరటి రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.


కోడిగుడ్లపాడులో అరటిపంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మైఖేల్‌రాజు

వెంకటరెడ్డి జీవిత చరిత్ర పుస్తకాల వితరణ

వేంపల్లె : కడప జిల్లా కమ్యూనిస్ట్ యోధుడు కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి జీవిత చరిత్రను ఆయన కుమారుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ(రాష్ట్రపతి) అవార్డు గ్రహీత గంగాధరరెడ్డి ×కడప జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణ శిల్పి కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి₹ అనే పుస్తకాలను వితరణ చేశారు. బుధవారం ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి, ఓఎస్డీ వైఎస్ గంగిరెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వచ్చే జ్ఞానం అపారమైందన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడుగా, జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతగా పొన్నతోట వెంకటరెడ్డి విశిష్టమైన కృషి చేశారన్నారు. ఆయన జీవిత చరిత్రను వెలుగులోకి తెచ్చిన రచయిత గంగాధరరెడ్డిని అభినందించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

చెన్నూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లతోపాటు సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. బుధవారం వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో పలు పథకాలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా పెన్షన్‌దారుడు మరణిస్తే వారి రేషన్‌కార్డులో వెంటనే అతని పేరు తొలగించి అతని భార్యకు పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిజిటల్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌తోపాటు సంక్షేమ పథకాలు వచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో వ్యాక్సిన్‌ను వేయించాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని చిన్నారులకు పోలియో వ్యాక్సిన్‌ను వేయించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.నాగరాజు తెలిపారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన చిన్నారులకు పోలియో వ్యాక్సిన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ ఉమామహేశ్వర్, డాక్టర్ మల్లీశ్వరి, మండల వైద్యాధికారి రాఘవేంద్ర, సీహెచ్ఓ టి.సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం అందిస్తాం


క్రీడాసామగ్రి అందజేస్తున్న అధికారులు

కడప స్పోర్ట్స్: క్రీడలను ప్రోత్సహించడమే నెహ్రూ యువకేంద్ర లక్ష్యమని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్‌హాస్టల్‌లో కడప బ్లాక్‌కు సంబంధించిన స్పోర్ట్స్ మెటీరియల్‌ను యూత్‌క్లబ్స్‌కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా క్రీడాకిట్‌లను అందజేస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ హాజరై మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సైతం ప్రోత్సాహమందిస్తే మరింత రాణించగలరని సూచించారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, ఎన్‌వైకే సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణమఠంలో బుక్‌స్టాల్


బుక్‌స్టాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రామకృష్ణమఠం స్వామిజీలు

కడప కల్చరల్ : కడప నగరం చెన్నూరు బస్టాండులోని రామకృష్ణమఠంలో బుధవారం మఠం స్వామిజీ సుకృతానంద బుక్‌స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బుక్‌స్టాల్‌లో స్వామి వివేకానందుని చరిత్ర, ఇతర ఆధ్యాత్మిక పుస్తకాలతోపాటు యువతకు కావాల్సిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాలు కూడా అందరికీ అందుబాటులో ఉంచామని తెలిపారు. వివేకానందుని చిత్రాలతో ఆకర్షణీయమైన మెమొంటోలు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. బేటిహరానంద స్వామి, స్వామి స్వర్గానంద, నగరప్రముఖులు, రామకృష్ణుని భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శాప్ డైరెక్టర్ డేనియల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని శాప్ డైరెక్టర్ డేనియల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లన మత్తు పదార్థాలకు దూరంగా ఉంటారన్నారు. ప్రాథమిక విద్య నుండే ప్రాథమిక పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు, జమీల,జగదీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంతర్ముఖ యోగంతోనే ఆనందం

పోరుమామిళ్ల : స్థానిక అమ్మవారిశాల కల్యాణ మండపంలో బుధవారం అంతర్ముఖం యోగాపై సత్య సాయి ధ్యానమండలి వ్యవస్థాపకులు భిక్షమయ్య గురూజీ అవగాహన కల్పించారు. ప్రకృతికి, సమాజానికి అత్యంత కీడు చేస్తున్నది మనిషేనన్నారు. కుటుంబవ్యవస్థ ఏర్పడ్డాక స్వార్థం పెరిగిందని, దాంతో సంపద కొరకు మానసిక శాంతి కోల్పోతున్నారన్నారు. అంతర్ముఖంగా ఆలోచించి, తన గురించి తాను తెలుసుకోవాలన్నారు.

9న వాహనాల వేలం

మైదుకూరు : వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను మైదుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో ఈనెల 9న వేలం వేస్తున్నట్లు కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మోటార్ సైకిళ్లను బద్వేలు ఎంవీఐ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ పాట పాడి వాహనాలను సొంతం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి వాహనంపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

గాలిగోపురం పనుల పరిశీలన

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానం నందు ఏర్పాటు చేస్తున్న రాజగోపురం, ప్రాకారం పనులను బుధవారం దేవాదాయశాఖ ఈఈ శేఖర్, డీఈ గంగయ్యలు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయించాలని ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలకు సూచించారు.